సాక్షి చిత్తూరు

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



జిల్లాను ఎన్నటికీ మరువలేను

చిత్తూరు కలెక్టరేట్ : పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న కలెక్టర్ హరినారాయణన్‌కు మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. - 8లో



కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన షన్మోహన్‌ను మంగళవారం పలువురు ప్రముఖులు కలిశారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	22
తిరుపతి	40	23
తిరుమల	35	19
గూడూరు	40	24
నగరి	40	23

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6.28	4.41
చిత్తూరు	6.30	4.40
పుంగనూరు	6.32	4.44

న్యూస్‌రీల్

జిల్లా జడ్జితో కలెక్టర్ భేటీ



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావును మంగళవారం నూతన కలెక్టర్ సగిలి షన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, కాసేపు ముచ్చటించారు.

బీఎంసీయూ నిర్వహణపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని బీఎంసీ(బల్క్‌మిల్క్ సెంటర్) పాల శీతలీకరణ కేంద్రం నిర్వహణపై మంగళవారం జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు డీపీఎం ఫైనాన్షియర్ రవి కుమార్, డీఎంజీ చిన్నితో పాటు అధికారులు బీఎంసీ నిర్వహణ, పాల సేకరణ, సిబ్బంది జీతాలు తదితర అంశాలకు సంబంధించి వివరాలను సేకరించారు. పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఎంలు కవిత, నాగేశ్వరరావు, బీఎంసీ డీపీఎం ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

నేడు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు

చిత్తూరు అగ్రికల్చర్: భూసార పరీక్షలు చేపట్టడంపై బుధవారం జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గంగాధర నెల్లూరు మండలం చిన్న వేపంజేరి రైతు భరోసా కేంద్రంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.


కలెక్టర్‌ను కలిసిన గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పురుషోత్తం

వెదురుకుప్పం : చిత్తూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ షన్మోహన్‌ను గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ మేలిపాటి పురుషోత్తం మంగళవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొత్తపల్లె భాస్కర్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉమాపతి పాల్గొన్నారు.

నేషనల్ సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా విద్యార్థిని ప్రతిభ



రాష్ట్రపతికి ప్రాజెక్టును వివరిస్తున్న చరణితేజ

పలమనేరు : నేషనల్ సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా విద్యార్థిని ఉత్తమ ప్రతిభను కనబరచి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నుంచి ప్రశంసలందుకున్నట్లు సైన్సు అధికారి రమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సాగుతున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు చెందిన పడిగల చరణితేజ రూపొందించిన బ్యాక్‌రెస్ట్ ఆఫ్ సైడ్‌సీటెడ్ ఉమెన్, జీబ్యాగ్స్ నమూనా అభినందనలు అందుకుందని వివరించారు.

నేడు డీఎస్సీ-1995 కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లా పరిధిలోని డీఎస్సీ-1995 క్వాలిఫైడ్ అభ్యర్థులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ బేసిస్‌లో మినిమమ్ టైం స్కేల్‌కు అంగీకారం తెలిపిన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు.

మొక్కవోని నిఘా!

వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది.. అన్నదాతకు అండగా నిలిచేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది.. అందులో భాగంగా సాగుకు అనుబంధంగా సాగుతున్న నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించింది.. రైతుకు నాణ్యమైన మొక్కలు సరఫరా చేసేలా కట్టుదిట్టంగా చర్యలు చేపడుతోంది.. విత్తు నాటింది మొలకెత్తించే విధానం.. మొక్క ఎదుగుదల మొదలు దిగుబడి వచ్చేవరకు అన్ని దశలపై నిఘా పెట్టి నిశితంగా పరిశీలిస్తోంది.. నాసిరకం నారుతో ఒక్క రైతు కూడా నష్టాలపాలు కాకుండా పక్కాగా జాగ్రత్తలు తీసుకుంటోంది.. ఇందుకోసం రిజిస్ట్రేషన్ సమయంలోనే నర్సరీ యాజమాన్యాల్లో జవాబుదారీతనం పెంచుతోంది.

- నర్సరీలపై నిరంతరం పర్యవేక్షణ
- విత్తు నుంచి దిగుబడి వరకు అన్నీ దశల పరిశీలన
- రైతులకు నాణ్యమైన నారు అందించడమే లక్ష్యం
- అన్నదాతకు నష్టం వాటిల్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టిన ప్రభుత్వం



ఏపుగా పెరిగిన వంగ నారు



నర్సరీలో పెంచిన జామ

సాక్షి, చిత్తూరు : వ్యవసాయంలో కాలక్రమేణా విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు రైతులు తమ పొలాల్లోనే నారు పోసుకునేవారు. అనంతరం మొక్క నాటుకుని సాగు చేసేవారు. ఈ క్రమంలో ఒక్కోసారి నాసిరకం విత్తనాలు విత్తడం, నారు పెంపకంలో చిన్న చిన్న పొరబాట్లు, సక్రమంగా యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం కారణంగా పంట నష్టపోయేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇబ్బడిముబ్బడిగా నర్సరీలు పుట్టుకొచ్చాయి. రైతులు తమకు కావాల్సిన పంటకు సంబంధించి మొక్కలను నేరుగా నర్సరీల్లోనే కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పువ్వులు, పండ్లు, కూరగాయల పంటల్లో ప్రారంభమైంది. మలిదశలో వరి, చెరుకు తదితర పంటలకు కూడా వ్యాప్తి చెందింది.

ఆధునిక పద్ధతులు

ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా నర్సరీలు ప్రారంభమయ్యాయి. కార్పొరేట్ కంపెనీలు సైతం తమ విత్తన వ్యాపారం అభివృద్ధి చేసుకునేందుకు నర్సరీలకు శ్రీకారం చుట్టాయి. ప్రస్తుతం దాదాపు అన్ని పంటలకు సంబంధించిన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. వరి, చెరుకు, టమాట, వంగ, బీర ,కాకర, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, మామిడి, సపోటా, నిమ్మ, చీనీ, జామ, దానిమ్మతోపాటు అన్ని రకాల పువ్వుల మొక్కలను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించే నర్సరీలు విజయవంతంగా నడుస్తున్నాయి. ఒక్కోసారి ఈ నర్సరీలు సరఫరా చేసే మొక్కలు నాణ్యంగా లేకంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. నర్సరీ యజమాన్యాలు బాధ్యతాయుతంగా మొక్కలను పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. నాణ్యమైన విత్తనాలను సేకరించడం, వాటిని విత్తటం, మొలకెత్తించటం, మొక్కలను పొలంలో నాటే వరకు నిరంతరం పరిశీలించాలని స్పష్టం చేసింది. అన్నదాత నాసిరకం నారు కారణంగా నష్టపోకూడదని ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా నిఘా పెట్టింది.



పకడ్బందీగా రిజిస్ట్రేషన్

ఉద్యానవన చట్టం- 2010 ప్రకారం నర్సరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ విభాగం పర్యవేక్షిస్తోంది. నర్సరీ ఏర్పాటు చేసిన ప్రదేశం, దానికి సంబంధించిన లేఅవుట్ మ్యాప్, భూమి స్థితిగతులు, భూసార పరీక్షల రిపోర్టు డిజిటల్ ఫొటోలతో పాటు యజమాని ఆధార్ కార్డు వివరాలను పొందుపరుస్తూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అలాగే రైతులు ఏమాత్రం నష్టపోకుండా చూసే బాధ్యతను సైతం నర్సరీల యాజమాన్యంపైనే ఉంచుతున్నారు.

పక్కాగా పర్యవేక్షణ

నర్సరీల్లో మొక్కల సంరక్షణ పద్ధతులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. విత్తనాల కొనుగోలు నుంచి మొక్కలను రైతులకు అప్పగించే వరకు సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. ఒకవేళ రైతు నష్టపోతే నర్సరీల యాజమాన్యాలు, విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలే బాధ్యత వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



మునగ



కొబ్బరి



మామిడి



క్యాబేజీ



చామంతి

సేవకు గుర్తింపుగా అవార్డు



నర్సరీ రంగంలో దాదాపు 20 ఏళ్లుగా ఉన్నా. మరోవైపు వ్యవసాయం చేస్తున్నా. సాగుకు చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టర్ వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు నాణ్యమైన మొక్కలను సరఫరా చేస్తున్నాం. ఈ విధానం ద్వారా నర్సరీ యాజమాన్యాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయి.

– రాఘవేంద్ర, నర్సరీ యజమాని, శాంతిపురం

ప్రభుత్వ నిర్ణయంతో న్యాయం



వ్యవసాయంలో నష్టపోకుండా ఉండాలంటే ముందు నాణ్యమైన మొక్కలను నాటుకోవాలి. రూ.లక్షలు వెచ్చించే రైతు విషయంలో నర్సరీలవారిపై ప్రభుత్వం బాధ్యత పెట్టడం మంచి నిర్ణయం. దీంతో రైతులకు న్యాయం జరుగుతుంది.

– అరుణ, రైతు, ఎంకే పురం, కుప్పం మండలం

నిరంతర పర్యవేక్షణ



రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. నాణ్యమైన మొక్కలను సరఫరా చేయకపోతే భారీగా నష్టపోయే ప్రమాదముంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు నర్సరీ యజమాని బాధ్యతగా నాణ్యమైన మొక్కలను సరఫరా చేయాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీప్రసన్న, ఉద్యానశాఖాధికారి, పలమనేరు

రైతు సంక్షేమం కోసమే..



రైతు సంక్షేమం కోసమే నర్సరీలపై ప్రభుత్వం నిఘా పెట్టింది. నాణ్యమైన మొక్కలను అందిస్తే అన్నదాతలు చక్కటి ఉత్పత్తులు సాధిస్తారు. తద్వారా గిట్టుబాటు ధర దక్కుతుంది. ఇందు కోసమే నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అలాగే నర్సరీ యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహం అందిస్తున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి

చిరస్మరణీయులు 'పూలే'

చిత్తూరు రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షన్మోహన్ కొనియాడారు. మంగళవారం నగరంలో జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. స్థానిక పీసీఆర్ సర్కిల్‌లోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అణగారిన కులాల అభ్యున్నతికి, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే విశేషంగా కృషి చేశారన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, బీసీ నాయకులు జ్ఞానజగదీష్, నారాయణ, రాంగణేష్, శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ గోపీనాథ్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు సైతం పూలేకు అంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, జిల్లా అధ్యక్షుడు బాబు, సభ్యులు ప్రభుకుమార్, రఘుపతి, మురళి, కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు పూలే విశిష్ట సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో నాగరాజు, మురళి, గోపీనాథ్, మణి, దాసరి చంద్ర, సత్యమూర్తి, ఆర్ముగం పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆరణి , కలెక్టర్ షన్మోహన్

యువతకు మార్గదర్శకులు

శ్రీరంగరాజపురం: సమాజంలో కులవ్యవస్థ నిర్మూలనకు పోరాడిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. పూలే చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మెదవాడ గ్రామంలో డిప్యూటీ సీఎం విలేకర్లతో మాట్లాడుతూ పూలే సేవలు మరువలేమన్నారు.

సినీ కార్మికుల సంఘం అధ్యక్షుడిగా సెల్వమణి



నగరి : దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) అధ్యక్షుడిగా ఆర్‌కే సెల్వమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఈ మేరకు సినీ కార్మిక సంఘం ప్రకటించింది. గతంలో అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయన కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసిన విధానమే మరో మారు పదవి దక్కేందుకు దోహదపడిందని సినీ కార్మిక సంఘం నేతలు తెలియజేశారు.

'ఉపాధి'లో సామాజిక తనిఖీ

నింద్ర:ఉపాధి పనులపై మంగళవారం మండల కేంద్రంలో సామాజిక తనిఖీ చేపట్టారు. డ్వామా పీడీ గంగాభవానీ మాట్లాడుతూ 2021-22 సంవత్సరానికి గాను 986 పనులకు గాను రూ.6.35 కోట్లు, పంచాయతీరాజ్ కింద 34 పనులకు గాను రూ.1.65 కోట్లు, తాగునీటి పథకం కింద 2 పనులకుగాను రూ.4.20 లక్షలు వెచ్చించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో రూ.2.50లక్షల పనులకు వివరాలు లేవన్నారు. అలాగే ఫీల్డ్ సిబ్బంది నుంచి రూ.7వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీపీ దీప, వీఓ లీడర్ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ పద్మజ, ఏపీడీ శోభన్‌బాబు, ఎంపీడీఓ వేణు, పీఆర్ ఏఈ వీరభద్రం, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అంజేరయ్య, ఏపీఓ ఇందుమతి పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న తనిఖీ బృందం

రంగేసి.. దోచేసి!

మేడిపండు చూడు మేలిమై ఉండు.. పొట్ట విప్పిచూడు పురుగులుండు చందంగా మారింది మార్కెట్లో బియ్యం పరిస్థితి. సంచులకు రకరకాల రంగులద్ది అందులో నాసిరకం బియ్యం నింపి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు బ్రాండెడ్ పేరుతో వినియోగదారులను బోల్తాకొట్టిస్తున్నారు. కొత్తరకం బ్రాండ్ అంటూ మార్కెట్లో పరిచయం చేసి నిలువునా దోచుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సాగుతున్న ఈ నకిలీ బియ్యం దందాపై ఏ ఒక్క అధికారీ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- విచ్చలవిడిగా నకిలీ బియ్యం విక్రయాలు
- రేషన్‌బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి అమ్మకాలు
- బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి అంటగడుగుతున్న వ్యాపారులు
- ఇష్టారాజ్యంగా ధరలు .. తనిఖీలు చేయని అధికారులు

సాక్షి, తిరుపతి/చిత్తూరు రూరల్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 3,002 రేషన్‌షాపులు ఉండగా వీటి కింద 11 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి నెలకు 25 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అవసరం. ఇందులో కొందరు వినియోగదారులు వ్యాపారులకు విక్రయిస్తుండగా.. మరి కొంతమంది అక్రమార్కులు రేషన్‌షాపుల వద్దే పాగా వేసి బియ్యాన్ని కిలో రూ.9 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత ఆ బియ్యాన్ని పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చి వాటికి ఓ బ్రాండ్ పేరుపెట్టి మార్కెట్లోకి తీసుకొస్తున్నారు. శ్రీ ఆహార్, బుల్లెట్, ఐరావత్, రాయల్ బుల్లెట్, సత్యసాయి బ్రాండ్ల బియ్యానికి మంచి గుర్తింపు ఉండగా.. ఆ బ్రాండ్‌ల అసలు వ్యాపారులు వేరు. ఇవే పేర్లతో కొందరు నకిలీలు రంగంలోకిదిగి యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. అలాగే సన్న బియ్యంగా తయారు చేసేటప్పుడు వచ్చే పిండిని కూడా పశులకు దాణాగా అమ్మేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇలా వ్యాపారులు రెండు రకాలుగా ఆదాయం పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బియ్యం బస్తాలు

ఏమార్చి..

గింజ పరిమాణం ఎలా కావాలంటే అలా తయారుచేసే ఆధునిక యంత్రాలు ప్రస్తుతం అందుబాటులోకొచ్చాయి. రూ.కోటి నుంచి రూ.2.5 కోట్ల విలువ చేసే సార్టెక్స్ యంత్రాలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు బియ్యం విక్రయాల్లో అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, జీడీనెల్లూరు, నియోజకవర్గాల్లో ఈ దందా నడుస్తోంది. బ్రాండెడ్ బియ్యానికి మాత్రమే ట్యాక్స్.. నాన్ బ్రాండెడ్ బియ్యానికి ట్యాక్స్ లేదని జీఎస్టీ కౌన్సిల్ తీర్మాణం ఇచ్చింది. ఇదే అదనుగా నకిలీలు బ్రాండెడ్ పేరుతో ఇటు వినియోగదారులను.. అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. 25 కిలోల బ్యాగ్ అయితే ప్రభుత్వానికి 5 శాతం జీఎస్టీ చెల్లించాలి. 26 కిలోల బ్యాగ్ అయితే జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఎక్కడా ఈ నకిలీ బ్రాండ్ వ్యాపారులు జీఎస్టీ చెల్లించడం లేదు. నకిలీ బ్రాండ్ రైస్ వ్యాపారులు తయారు చేసిన బ్యాగ్‌లపై అడ్రస్ కూడా ఉండడంలేదు. ఒరిజనల్ బ్రాండ్ వ్యాపారులు రైస్ మిల్లు అడ్రస్, ఫోన్ నంబర్‌ను బ్యాగ్‌పై ముద్రించాల్సి ఉంది. ఆహార్ బ్రాండ్ రైస్ బ్యాగ్‌పై ఓనర్ ఫొటో కూడా ముద్రిస్తారు. 50 కిలోల బ్యాగ్ ఎక్స్‌పోర్ట్‌కు ట్యాక్స్ అవసరం లేదు. కొన్ని వ్యాపార దుకాణాల్లో 25, 26 కిలోల బస్తా 23, 24 కిలోలు ఉంటోంది. అయినా అటువైపు తూనికలు కొలతలశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ధరల్లో తలోదారి

పదేళ్ల కిందట ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,500 నుంచి 2వేల బియ్యం దుకాణాలు ఉండగా.. ప్రస్తుతం అవి ఏడు వేలకుపైగా చేరాయి. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం గడించే వ్యాపారం కావడంతో పలువురు వ్యాపారులు, మిల్లర్లు కలిసి ఈ దందాకు తెరలేపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వాలిటీ ఉండే బియ్యాన్ని కిలో రూ.35 మించి బహిరంగ మార్కెట్లో విక్రయించకూడదు. ఓ పేరు మోసిన బ్రాండ్ కిలో బియ్యాన్ని రూ.60కి అమ్ముతుంటే.. ఎటువంటి గుర్తింపు, అనుమతులు లేని మరికొంత మంది వ్యాపారులు కిలో బియ్యం రూ.55 విక్రయిస్తున్నారు. 25 కిలోలు, 26కిలోల బస్తా బియ్యం రూ.1,300–రూ.1,500 వరకు పలుకుతోంది.

మాకు ఫిర్యాదులు అందలేదు

బియ్యం బ్యాగుల్లో తక్కువ, ఎక్కువ వంటి కంప్లైంట్స్ లేవు. ఫిర్యాదులొస్తేనే తనిఖీలు చేస్తాం. ఇక బ్రాండ్ల పేరుతో అమ్ముతున్నారా? లేదా? అనే విషయాలు మా పరిధిలోకి రావు.

– సుధాకర్, తూనికలు కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్

ఫిర్యాదు చేయండి

రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి అమ్ముతుంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయొచ్చు. తనిఖీలో అది నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యంతో దందా చేసేవారిని వదలం. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– శంకరన్, డీఎ‌ఓ.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు




ప్రకాశం యాదవ్‌కు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, స్వామివారి దర్శనానికి వస్తున్న నెల్లూరు కలెక్టర్ హరినారాయణన్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న కలెక్టర్ హరినారాయణన్, మేకల, గొర్రెల పరిరక్షణ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాశం యాదవ్ వేర్వేరుగా స్వామిని సేవించుకున్నారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి వారికి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వదించారు. జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలా కుమారి, ఏపీఓ సంధ్య, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీనాయుడు పాల్గొన్నారు.

నేడు రెండో విడత 'ఈబీసీ నేస్తం'

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద బుధవారం రెండో విడత సాయం అందించనున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈబీసీ నేస్తం కింద జిల్లాలో మొత్తం 23,668 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.33.50 కోట్లు జమ చేయనున్నట్లు ఆయన వివరించారు.

జిల్లాను ఎన్నటికీ మరువలేను

- కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్‌కు ఘనంగా వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న కలెక్టర్, జేసీలకు జ్ఞాపికను అందజేస్తున్న నూతన కలెక్టర్ షన్‌మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లాలో పనిచేసిన అనుభవాలను ఎన్నటికీ మరువలేనని నెల్లూరు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనతోపాటు జేసీ వెంకటేశ్వర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. హరి నారాయణన్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడం ప్రధానమని, ప్రభుత్వ అజెండాను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. జిల్లాలో పనిచేస్తున్న సమయంలో కోవిడ్ రెండో వేవ్, తుపానులు, జిల్లాల పునర్విభజన జరిగిందని వెల్లడించారు. మంత్రులు కె.నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీలు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని శాఖల అధికారులు సహకారం మరువలేనిదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు పూర్తి సహకారం అందించిన మీడియా ప్రతినిధులు , సమాచార శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జేసీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ హౌసింగ్, రీ సర్వే పురోగతిలో కలెక్టర్ హరినారాయణన్ సూచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. నూతన కలెక్టర్ షన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ కలెక్టర్ హరి నారాయణన్ సేవలను జిల్లావాసులు మరచిపోలేరని కొనియాడారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్ హరి నారాయణన్ రాజీ పడేవారు కారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీధర్, డీఈఓ విజయేంద్రరావు, ఆర్‌డీఓలు రేణుక, సుజన, ఎల్‌డీఎం శేషగిరిరావ్, తిరుపతి డీఎంహెచ్‌ఓ శ్రీహరి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమర్‌నాథ్, వి.కోట ఎంపీడీఓ బాలాజీ, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,500
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.75,000
రిటైల్ వెండి గ్రాము రూ.77

ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు అర్బన్: కోర్టులో వివిధ ఉద్యోగాలకు ఎంపికైనా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఎస్టేట్‌లోని కోర్టు సముదాయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఈనెల 13, 15 తేదీల్లో ఫీల్డ్ అసిస్టెంట్, ఎక్జామినర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులకు, 17,18 తేదీల్లో ప్రాసెస్ సర్వర్, 19, 20 ,21, 24తేదీల్లో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు.

బండిబాట ఆక్రమణపై ఫిర్యాదు

పలమనేరు : వి.కోట మండలం ఓగు పంచాయతీ నుంచి రెక్కమానుకు మధ్యలోని బండి బాట ఆక్రమణపై ఆర్‌డీఓకు ఇరుగ్రామాల ప్రజలు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి వినియోగిస్తున్న బాటను ఓగు గ్రామానికి చెందిన రాజప్ప, సుబ్బమ్మ జేసీబీతో చదును చేసి తమ పొలాల్లో కలిపేస్తున్నారన్నారు. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పశువులను మేతకు కూడా తీసుకెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. విచారించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు వేణు ఆచారి, మంజునాథ్, నారాయణప్ప, మురుగేష్, చలపతి పాల్గొన్నారు.

గంజాయి పాపం చంద్రబాబుదే



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : రాష్ట్రంలో గంజాయి సాగును పెంచి పోషించింది చంద్రబాబే అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అక్రమ సంపాదనకు అలవాటు పడిన టీడీపీ నేతలే గంజాయి సాగు చేస్తున్నారన్నారు. వారి పాపంలో చంద్రబాబుకు కూడా వాటా ఉందని తెలిపారు. టీడీపీ మునిగిపోయే నావని, దాన్ని తెడ్డేసి నిలబెట్టాలని లోకజ్ఞానం లేని లోకేష్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై బురదచల్లడమే లక్ష్యంగా చంద్రబాబు, లోకేష్ కుటిల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ హెరిటేజ్ ఫ్యాక్టరీ కోసం పాడి రైతులకు వరంలాంటి విజయ డెయిరీని మూసివేయించారని తెలిపారు. ఇప్పుడు పాడి రైతులకు అండగా నిలిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని వివరించారు. పదవీ కాంక్షతో చంద్రబాబు రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం సైతం వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు.

మంత్రి పదవికే అలంకారం రోజమ్మ



నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు రూరల్: మంత్రి పదవికే ఆర్‌కే రోజమ్మ అలంకారమని మున్సిపల్ చైర్మన్ హరి కొనియాడారు. ఆమె మంత్రి పదవిని చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. హరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంగా ఇచ్చిన మంత్రి పదవికి రోజమ్మ నూటికి నూరుపాళ్లు న్యాయం చేస్తున్నారన్నారు. పర్యాటక రంగంలో దేశంలోనే మన రాష్ట్రాన్ని మూడోస్థానంలో నిలబెట్టారని వెల్లడించారు. రాజకీయంగా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా దీటుగా నిలబడ్డారని ప్రశంసించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిస్వార్థ ప్రజాసేవతో ఆమె ఉన్నతంగా ఎదిగారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు గుణశేఖర్, ఏకాంబరం, చిట్టిబాబు, బాలసుబ్రమణ్యం, కుప్పమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, రమేష్ బాబు, ప్రసాద్, మునిరత్నం, అన్నా లోకనాథం, సుదర్శనం, బుజ్జి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం తరలిస్తున్న యువకుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

పలమనేరు : గంగవరం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.1.54లక్షల విలువైన 10 ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ నయీమ్‌అలీ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం తాలూకా నాయకనేరికి చెందిన రాధాకృష్ణన్(25) టాటా సుమోలో దుంగలను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎఫ్‌ఎస్‌ఓలు సుకుమార్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

నగరి : మండలంలోని ఓజీ కుప్పంలో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసంతి మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో దాడి చేయగా పి.వెంకటమణ(25), ఎం.వెంకటరమణ(20) అనే ఇద్దరు యువకులు పట్టుబడ్డారన్నారు. నిందితుల నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. డీటీ గుణశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు పంపినట్లు వివరించారు. దాడిలో సిబ్బంది బాబు, గవాస్కర్, భాగ్యరాజ్, ధనకోటి, వీఆర్‌ఓలు ప్రభాకర్, చరణ్ కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



బంగారుపాళెం: మండలంలోని కాటప్పగారిపల్లె పంచాయతీ దిగువ ఎద్దులవారిపల్లె సమీపంలో మంగళవారం కుక్కలు దాడికి గురై జింక మృతి చెందినట్లు సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి దారితప్పి వచ్చిన జింకను కుక్కలు చంపేశాయన్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎఫ్‌బీఓ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరానికి పశువైద్యశాలలో పోస్టుమార్టం చేయించారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కుప్పానికి చెందిన బి.వి.కృష్ణప్ప (62) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మదనపల్లె మండలం మొలకలదిన్నె క్రాస్‌లో నివసిస్తున్న కుమారుడు మణి ఇంటికి వచ్చాడు. బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణప్ప తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్సల అనంతరం బాధితుని పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

విద్యుత్ అదనపులోడ్ రుసుం వసూలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ కింద మంగళవారం రూ.5.05 లక్షలు వసూలు చేసినట్లు ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు.

ఆదర్శనీయులు 'పూలే'



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షన్మోహన్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్ : జ్యోతిరావుపూలే జయంతిని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షన్‌మోహన్, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య తదితరులు పాల్గొన్నారు. పూలే ఆశయాల సాధనకు అందరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి సమాజానికి ఆదర్శనీయంగా దిశానిర్దేశం చేసిన మహనీయులు పూలే అని కొనియాడారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు





ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు, బుల్లెట్ సురేష్

చిత్తూరు కలెక్టరేట్ : నూతన కలెక్టర్ షన్‌మోహన్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నేతలు బుల్లెట్ అప్పు, ధరణీష్ రెడ్డి, మునికుమార్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి గురువులతో విద్యార్థులు

పలమనేరు: పట్టణసమీపంలోని జీఎల్‌ఎస్‌ఫామ్ జెడ్పీ హైస్కూల్‌లో 1996–97 పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో మంగళవారం ఒక్కటయ్యారు. అప్పటి గురువులను సన్మానించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పూర్వ విద్యార్థి మునెప్ప కుటుంబసభ్యులకు రూ.50 వేలు విలువజేసే పాడి ఆవును అందించారు.

అనుమానంతో మహిళ హత్య



ఘటనాస్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలోని శేషాచలపురం యానాదికాలనీలో సోమవారం రాత్రి ఓ మహిళను ప్రియుడే అనుమానంతో హత్య చేశాడు. మంగళవారం ఎస్‌ఐ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. కాలనీ చెందిన కస్తూరి (45)కి ముగ్గురు పిల్లలు. భర్త శేషయ్య అనారోగ్యంతో ఏడాదిక్రితం మరణించాడు. కుమార్తె కూడా మృతి చెందింది. కుమారులకు వివాహమై పిల్లలున్నారు. అలాగే శేషాచలపురానికి చెందిన శ్రీరాములు (52) వేధింపులు తాళలేక భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం కస్తూరితో శ్రీరాములకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇద్దరికీ మేకలు ఉండడంతో ప్రతిరోజూ వాటిని మేత కోసం ఊరు చివరికి తోలుకెళ్లేవారు. కొన్ని రోజులుగా కస్తూరి వేరే వ్యక్తులతో మాట్లాడుతోందని శ్రీరాములుకు అనుమానంగా ఉండేది. సోమవారం మేకలను మేతకు తీసుకెళ్లిన సమయంలో ఇరువురూ ఈ విషయమై గొడవ పడ్డారు. దీంతో శ్రీరాములు కోపం పట్టలేక తన చేతిలోని దోటి కొంకితో కస్తూరిపై దాడి చేశాడు. ముఖం, తల వెనుకభాగంపై విచక్షణారహితంగా కొట్టి చంపేశాడు. సాయంత్రం 6.30 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న మేకలతో కస్తూరి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చేపట్టారు. రాత్రి 10 గంటల సమయంలో ఊరి చివరన పొలాల్లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మంగళవారం ఉదయం డీఎస్పీ శ్రీనివాసమూర్తి, తాలూకా సీఐ గంగిరెడ్డి హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బైక్, మద్యంతో పోలీసులు

పలమనేరు : కర్ణాటక నుంచి తీసుకువస్తున్న 480 టెట్రా ప్యాకెట్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు డీటీఎఫ్ సీఐ మాధవస్వామి తెలిపారు. రూట్‌వాచ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టగా బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లె వద్ద అదే గ్రామానికి చెందిన నంద అనే వ్యక్తి బైక్‌లో మద్యం తీసువస్తూ ఎదురుపడినట్టు తెలిపారు. నిందితుడు బైక్‌తో సహా మద్యం ప్యాకెట్లను వదిలేసి పరారైనట్లు వెల్లడించారు. తనిఖీలో ఎస్ఐలు మస్తాన్‌వలీ, పృథ్వీ, సిబ్బంది పాల్గొన్నారు.